క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన తలారి



తాడేపల్లిలో వైఎస్ జగన్‌కు కరచాలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: తాడేపల్లిలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు హాజరయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితితో పాటు, ఇతర అంశాలపై చర్చించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని అధినేత నిర్దేశించినట్టు వెంకట్రావు తెలిపారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని చెప్పారన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పాలంగి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం త్రయోదశి సందర్భంగా నందీశ్వరుడుకి ఆలయ అర్చకులు రఘుశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

టెన్త్ విద్యార్థినికి సత్కారం



విద్యార్థిని సాయిసంజనను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

నల్లజర్ల: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 558 మార్కులు సాధించిన చిత్రాడ సాయి సంజనను గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం దూబచర్ల శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు గురువారం సత్కరించారు. ఆమెకు రూ.2 వేల నగదుతో పాటు, గ్రోసు గోపలయ్య స్మారక మెమెంటో, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు పాట్నూరి రాంబాబు, చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

నిడదవోలు రూరల్: మహిళపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన పాలకుర్తి మేరీకి, అదే ప్రాంతానికి చెందిన కట్టా జగదీష్ మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో బుధవారం తనపై జగదీష్ దాడి చేసినట్టు మేరీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

నిడదవోలు రూరల్: ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎస్.సంతోష్‌కుమార్ అన్నారు. నిడదవోలు వెలుగు కార్యాలయంలో గురువారం ఆర్బీఐ డిపాజిటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ కె.వెంకట మహేష్ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొదుపు ఖాతాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.అనిల్, ఎం.రమేష్, రిసోర్స్‌పర్సన్లు కె.అశోక్, ట్రైనర్లు డి.లక్ష్మీశ్రావణి, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు మెరుగు

రంగంపేట: ఇంకుడుగుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు మెరుగు పడతాయని హెచ్‌ఎం వి.పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో వర్షపు, వాడుక నీటిని ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చేయాలన్నారు.

సంపూర్ణ ఆరోగ్య యోగం

- యోగాతో జ్ఞాపక శక్తి వృద్ధి, ఒత్తిడి దూరం
- నిరంతర సాధనకు యువత ఆసక్తి
- 22 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్న గురువు రాజారావు



దూబచర్ల హైస్కూలులో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న గురువు రాజారావు



కాలభైరవ ఆసనం



విద్యార్థుల యోగా డ్రిల్‌లో ఓ భాగం

నల్లజర్ల/తాళ్లపూడి: ఉరుకులు పరుగుల జీవనంలో యోగా మంచిదేగా అంటోంది ఆధునిక ప్రపంచం. చిన్నతనం నుంచి మొదలు.. వృద్ధాప్యం మీదపడినా అనేక మంది యోగాసనాలు వేస్తూ భళా అనిపిస్తున్నారు. నిత్యం యోగాసనాలు వేయడం వల్ల శరీర భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. విద్యార్థుల్లో జ్ఞాపక శక్తితో పాటు, జీవశక్తి, వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురువు దూబచర్ల హైస్కూలులో పీఈటీ దూబగుంట్ల రాజారావు అన్నారు. ప్రతి రోజు ఉదయాన్నే సూర్య నమస్కారాలు, ఆసనాలు వేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. పీఈటీ శిక్షణ సమయం నుంచే దాదాపు 22 ఏళ్లుగా యోగా శిక్షణ ఇచ్చినట్టు రాజారావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు...

ఐదు మండలాల్లో శిక్షణ

నల్లజర్ల, పరిసర ఐదు మండలాల్లో ఆరేళ్లుగా 16 గ్రామాల్లో శిక్షణా తరగతులు నిర్వహించి, వేలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ ఇచ్చారు. నిత్య జీవితంలో అనేక రుగ్మతలకు యోగా చక్కని పరిష్కార మార్గం. బీపీ, షుగర్, వెన్నునొప్పి, థైరాయిడ్, పిల్లల్లో ఎదుగుదల, జ్ఞాపక శక్తి లోపం, జుట్టు రాలడం వంటి ఆరోగ్య సమస్యలకూ పరిష్కారం చూపుతుంది. మానవ శరీరంలో ఉన్న అష్ట చక్రాల కదలికల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షు సిద్ధిస్తుంది. 12 రకాల ఆసనాలు కనిపెట్టారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాజారావు విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్నదే ఆయన లక్ష్యం.

మానసిక ప్రశాంతత, జ్ఞాపక శక్తి వృద్ధి

నేటి ఆధునిక ప్రపంచంలో అనేక శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసేందుకు యోగా చక్కని ఔషధంలా పనిచేస్తుంది. పిల్లల్లో మానసిక ప్రవర్తనలో మార్పు తెస్తుంది. నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత, జ్ఞాపక శక్తి పెరగడానికి ఉపయోగపడుతుంది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా తప్పనిసరి.

> **ఇంటి పేరే యోగాగా..**
>
> 
>
> దూబగుంట్ల రాజారావు ఇంటి పేరే యోగా రాజారావుగా మారింది. 18 గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చాను. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహిస్తున్నాను. సాధన పూర్తయిన విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలకు పంపుతాం.
>
> – దూబగుంట్ల రాజారావు, పీఈటీ, జెడ్పీ హైస్కూలు, దూబచర్ల

తీరికలేని ఉద్యోగమైనా.. యోగాపై మక్కువ



హలాసనం వేస్తున్న ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు

తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌వోగా పనిచేస్తున్న జోడాల వెంకటేశ్వరరావు క్షణం తీరిక లేని ఉద్యోగ బాధ్యతలతో పాటు, నిరంతరం పలు సేవా కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తుంటారు. మానవత సంస్థకు గతంలో అధ్యక్షుడిగా వ్యవహరించారు. బ్లడ్ క్యాంపులు, సమాజ సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటారు. అంతేకాకుండా యోగాపై మక్కువతో కఠోర సాధన చేసి, పలు కఠినమైన ఆసనాలను కూడా సులభంగా వేస్తున్నారు. యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా సాధన చేస్తున్నారు. ఈయన కఠినమైన పద్మాసనం, హలాసనం, చక్రాసనం, మయూరాసనం, విష్టాసనం(వృష్టసనం) సర్వాంగాసనం, మత్స్యాసనం, జ్ఞాన శిరసనం, శిరసనం, కుక్కుటాసనం తదితర ఆసనాలపై కేవలం రెండు నెలల్లో పట్టు సాధించారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టాలి

అధికారులకు ఎమ్మెల్యే ముప్పిడి ఆదేశం



కొవ్వూరు పురపాలక సంఘంలో పొక్లెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: పట్టణంలో ప్రజలకు తాగునీరు, వీధి లైట్లు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.35.50 లక్షలు వెచ్చించి పురపాలక సంఘం కొనుగోలు చేసిన పొక్లెయిన్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం కౌన్సిల్ హాలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ శివారున నిర్మించిన జగనన్న కాలనీ వాసులకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా కాలనీల్లో నాలుగు రోడ్ల కూడళ్లలో తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. ఇందిరమ్మ కాలనీ, యానాద కాలనీ, అచ్చాయమ్మ కాలనీల్లో తాగునీటి పైపులైన్ల సమస్య ఉందని స్థానికులు తన దృష్టికి తెచ్చారన్నారు. గోదావరి జలాలను శుద్ధి చేసి, తాగునీటి అవసరాలను తీర్చాలని రూ.56 కోట్ల వ్యయంతో రుపొందించిన ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ పనులను రెండు ప్యాకేజీలుగా చేపట్టామని, పైపు లైన్ పనులు కొంత మేరకు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల పనులు నిలిచినట్టు చెప్పారు. ఈ పనుల పూర్తి వివరాలను అందజేస్తే, ప్రభుత్వంతో చర్చించి కొవ్వూరు, ఐ.పంగిడిలో మంజూరైన తాగునీటి పథకాలకు నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెల్లడించారు. టౌన్ ప్లానింగ్‌పై పలు ఆరోపణలు వస్తున్నాయని టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని చెప్పారు. పురపాలక సంఘానికి అందుతున్న వివిధ రకాల నిధులు, వినియోగం, ప్రస్తుత నిల్వ తదితర వివరాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ పురపాలక సంఘంలో సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కమిషనర్ జోసఫ్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించండి

వివిధ సమస్యల పరిష్కారం కోసం నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగడంతో పాటు, వారి అర్జీలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కాలయాపన చేయకుండా ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. పదవీ విరమణ చేసిన పలువురు రెవెన్యూ ఉద్యోగులను, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడికి పోతానంటూ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లజర్ల: బడిఈడు పిల్లలంతా స్కూళ్లలోనే ఉండాలనే ఉద్దేశంతో విద్యా శాఖ నేను బడికి పోతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. పోతవరం హైస్కూలు పరిధిలో గురువారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ నెల13 నుంచి నెల రోజుల పాటు సాగే ఈ స్పెషల్ డ్రైవ్‌లో సచివాలయ ఉద్యోగులతో పాటు, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లల్ని గుర్తిస్తారన్నారు. వారు బడిలో చేరేలా తల్లిదండ్రులను ఒప్పిస్తారన్నారు. వారితోనే అమ్మా నేను బడికి పోతా అని చెప్పిస్తారన్నారు. పిల్లలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తారన్నారు. ప్రతి రోజు 30 గృహాలు సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 భగవతి, హెచ్‌ఎం గోపిగోవర్ధన్, సీఆర్పీ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు



కొవ్వూరు జూనియర్ కళాశాలలో సదస్సులో మాట్లాతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

కొవ్వూరు: ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం తమవంతు కృషి చేయాలని, సమాజాన్ని నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం యాంటీ డ్రగ్స్ వారోత్సవాల సభ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే కలిగే దుష్పరిణామాలు, చట్టాలు, శిక్షలను వివరించారు. డ్రగ్స్ వాడకం ద్వారా సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. దేశ భవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.సతీష్, ఇతర అధ్యాపకులు, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యురాలు డి.సత్యకుమారి, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.విజయలక్ష్మి, బి.ఉదయభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో పతనమే..

దేవరపల్లి: వ్యక్తి మత్తు పదార్థాలకు బానిసైతే అతడి పతనావస్థ ప్రారంభమవుతుందని ఎస్‌ఈబీ దేవరపల్లి సీఐ కె.వెంకటేశ్వరస్వామి అన్నారు. మత్తు పదార్థాల వినియోగంపై స్థానిక ప్రైవేటు స్కూలు విద్యార్థులకు ఎస్‌ఈబీ అధికారులు అవగాహన కల్పించారు. సీఐ కె.వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, హాసిస్ వంటి డ్రగ్స్‌కు బానిసలైతే కలిగే దుష్ఫలితాలను వివరించారు. పరిచయస్తుల ఒత్తిడి వల్ల, సరదా కోసం డ్రగ్స్ తీసుకుంటే తీవ్ర శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారని చెప్పారు. డ్రగ్స్ మత్తులో కుటుంబ సభ్యులపై, ఇతరులపై దాడులు చేయడం, దొంగతనాలకు పాల్పడడం చేస్తారని తెలిపారు. కుటుంబంలోను, సమాజంలోను మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విద్యార్థులు కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పి.పేరయ్యనాయుడు, షేక్ షబానా, ఎస్‌ఈబీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



తాళ్లపూడిలో రెవెన్యూ డేలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



నల్లజర్లలో పదవీ విరమణ చేసిన గ్రామ సేవకులను సత్కరిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

తాళ్లపూడి: భూమిశిస్తు ఆధారంగా రెవెన్యూ శాఖ ఏర్పడిందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మనిషి పుట్టుక నుంచి చావు వరకు అన్ని ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ శాఖ జారీ చేస్తుందన్నారు. ఈ శాఖలో చిన్న పొరబాట్లు సహజమని, వాటినే మొత్తం శాఖకు ఆపాదించవద్దన్నారు. ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శాఖ పరిణామ క్రమం, గొప్పతనాన్ని వివరించారు. భూమిపై హక్కు ఉన్న ప్రతిఒక్కరూ వారి రెవెన్యూ రికార్డులను తరచూ చెక్ చేసుకోవచ్చన్నారు. అనంతరం రెవెన్యూ శాఖలో పదవీ విరమణ చేసిన సదాశివరావును సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రేషన్ షాపు డీలర్లు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులతో..

నల్లజర్ల: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 20న రెవెన్యూ డే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.కృష్ణారావు తెలిపారు. గురువారం నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే నిర్వహించారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఆయన వివరించారు. పదవీ విరమణ చేసిన గ్రామ నౌకర్లు బిరుదుగడ్డ రాజారావు, విప్పర్తి సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్, సర్వేయరు గౌతమ్, వీఆర్వోలు, నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన నారుమడి



కానూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నర్సింహారావు

పెరవలి: ఆకుమడులు త్వరగా మొలకెత్తాలనే ఉద్దేశంతో రైతులు ఎరువులు అధికంగా వేయటం, తెగుళ్ల నివారణ కోసం విచక్షణా రహితంగా పురుగు మందులను వినియోగించటం మంచిది కాదని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా వెంకట నర్సింహారావు అన్నారు. సక్రమమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చాలని చెప్పారు. మండలంలోని కానూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ఏరువాక శాస్త్రవేత్తల బృందం నిర్వహించింది. రైతులకు నారుమడి, ఎరువుల యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు.

యాజమాన్య పద్ధతులివే..

సార్వా పంటకు నారుమడి వేసే 10 రోజుల ముందే దమ్ముచేసి, చేనును చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి అనువుగా బోదెలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లే ముందు, ఆ తర్వాత, విత్తిన 12 రోజులకు మరో కిలో చల్లాలి) ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలోనే వేయాలి. విత్తనాలు చల్లిన తర్వాత మొలక వచ్చిన అనంతరం ఒక ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరుతడులు నీరు ఇచ్చి, ఆ తర్వాత పలచగా నీరును కట్టాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా నారు తీయటానికి 7 రోజుల ముందు గుళికలను వేయాలి. అలాగే నాట్లు వేసేటప్పుడు నారు కట్టలుగా ఉన్నప్పుడే నారు ఆకుల చివర్లను తుంచి నాట్లు వేయాలి. దీని వలన ఆకులపై ఉన్న తెగుళ్ల కారకాల గుడ్డు ముద్దలు నాశనం అవుతాయి. ఈ విధంగా నారుమడిని పెంచి నాట్లు వేసుకుంటే పంటకు తెగుళ్ల బెడద ఉండదు. నారుమడి వేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలి. అందుకు కిలో విత్తనానికి కార్బండిజం 25 శాతం, మాంకోజెబ్ 50 శాతం మిశ్రమ శిలీంధ్ర నాశిని 2 గ్రాముల చొప్పన నీటిలో కరిగించి విత్తనానికి పట్టించాలి. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన నారుమడితో పాటు, తెగుళ్ల బెడద అంతంతమాత్రంగా ఉంటుందని శాస్త్రవేత్తల బృందం వివరించింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమాజ్యోతి, సర్పంచ్ బి.మధుపూర్ణచందు, రైతు ముళ్లపూడి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 5కే విద్యుత్ సరఫరా ఇవ్వాలి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

చాగల్లు: వ్యవసాయ మోటార్లకు ఉదయం 5 నుంచి విద్యుత్ సరఫరా ఇవ్వాలని రైతులు గురువారం సాయంత్రం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం చాగల్లులో ట్రాన్స్‌కో ఏఈ త్రిమూర్తులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సార్వా పంటల దమ్ములు ముందుకెళ్లడం లేదని, ఉదయం ఐదు గంటలకు విద్యుత్ సరఫరా చేస్తే దమ్ములు అవుతాయని వివరించారు. కార్యక్రమంలో చాగల్లు, నెలటూరు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: ప్రకాశరావుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ప్రకాశరావుపాలెం, ఆవపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి: దేవరపల్లిలో ఎస్‌ఈబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఓ వ్యక్తి నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్టు సీఐ కె.వెంకటేశ్వరస్వామి తెలిపారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.